నల్లబజారుకు పేదల బియ్యం

● ఆగని అక్రమ రవాణా
● పట్టించుకోని అధికారులు

పొన్నూరు: పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా మాత్రం ఆగడం లేదు. మండలంలోని పలు గ్రామాల నుంచి నిత్యం అక్రమార్కులు రేషన్ బియ్యాన్ని ఆటోలు, ద్విచక్రవాహనాలపై తరలిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో స్వయంగా రేషన్ దుకాణదారుడి వద్దనే దళారులు కొనుగోలు చేసి దర్జాగా తరలిస్తున్నారు. ఎండీయూ వాహనదారులే రేషన్ బియ్యం నిల్వ చేసి అక్రమ రవాణాకు పాల్పడుతూ పట్టుబడిన సంఘటనలు చోటు చేసుకున్నాయి. పౌర సరఫరా అధికారులు మాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. గత కొంతకాలంగా రూరల్ పోలీసులు నిర్వహిస్తున్న దాడుల్లో ఉప్పరపాలెం, నండూరు, బ్రాహ్మణకోడూరులో టన్నుల కొద్దీ రేషన్ బియ్యం నిల్వలు పట్టుబడుతున్నాయి. అక్రమ వ్యాపారస్తులపై కేసులు నమోదు చేసినా పూర్తిస్థాయిలో అక్రమ రవాణా మాత్రం ఆగడం లేదు.

క్షేత్రస్థాయిలో కొరవడిన నిఘా

పీడీఎస్ బియ్యం పక్కదారి పడుతున్నా క్షేత్రస్థాయిలో నిఘా కొరవడటంతో అక్రమార్కులు యథేచ్ఛగా తరలిస్తున్నారు. ప్రస్తుతం నవంబరు నెలకు సంబంధించి ఎండీయూ వాహనాల ద్వారా లబ్ధిదారులకు రేషన్ సరుకుల పంపిణీ జరుగుతోంది. ప్రతి నెలా 1నుంచి 17వ తేదీ వరకు పంపిణీ చేస్తారు. సక్రమంగా సరుకుల పంపిణీ జరుగుతుందో లేదో చూడాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ఎండీయూ వాహనదారులు, రేషన్ దుకాణదారులు ఒక్కటై పోయారు. పేదల వద్ద బియ్యం తక్కువ ధరకు కొనుగోలు చేసి అధిక ధరకు నల్లబజారులో అమ్ముతున్నారు. మండలంలో సుమారు 35,858 వేల రేషన్ కార్డులున్నాయి.


నండూరులో పట్టుబడిన రేషన్ బియ్యం బస్తాలు (ఫైల్)


పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం (ఫైల్)

కార్డుదారుల నుంచి నేరుగా కొనుగోలు

అధికారుల అలసత్వంతో డీలర్లు, ఎండీయూ వాహనదారులు చేతివాటం చూపుతున్నారని ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి. పంచదార, కందిపప్పు ఈ నెల పూర్తి స్థాయిలో వచ్చాయి. అయితే కార్డుదారుల నుంచి బియ్యం, సరుకులను పలువురు డీలర్లు, ఎండీయూ వాహనదారులే కొనుగోలు చేసి అక్రమ వ్యాపారస్తులకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇంత జరుగుతున్నా పౌర సరఫరా అధికారులు పట్టించుకోవడం లేదు. చౌక దుకాణాలు, ఎండీయూ వాహనాలు తనిఖీలు చేపట్టకపోవడంతో పీడీఎస్ బియ్యం, సరుకులు నల్లబజారుకు తరలిపోతున్నాయి.

పట్టుబడితే చర్యలు తప్పవు



పేదలకు ఇచ్చే పీడీయస్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. అక్రమాలకు పాల్పడే డీలర్లపై కేసులు నమోదు చేశాం. రేషన్ దుకాణదారులు, ఎండీయూ ఆపరేటర్లు తప్పిదాలకు పాల్పడితే చర్యలు తప్పవు. ఎప్పటికప్పుడు చౌకదుకాణాలు, ఎండీయూ వాహనాలను తనిఖీ చేస్తున్నాం. బియ్యం అక్రమ రవాణా చేస్తున్న, బియ్యం, సరుకులు కార్డుదారుల నుంచి కొనుగోలు చేసినా మాకు సమాచారం వస్తే వెంటనే వారిపై చర్యలు తీసుకుంటాం.

– మహమ్మద్ జియావుల్‌హక్, తహసీల్దార్, పొన్నూరు

క్లుప్తంగా

గుండెపోటుతో మామిళ్లపల్లి సర్పంచి మృతి



పొన్నూరు: మండలంలోని మామిళ్లపల్లి గ్రామ సర్పంచి జాలాది యానాదిరావు (58) గుండెపోటుతో గురువారం ఉదయం మరణించారు. సమాచారం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ గ్రామంలోని సర్పంచి నివాసంలో ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. యానాదిరావు సర్పంచిగా గ్రామానికి, వైఎస్సార్ సీపీకి చేసిన సేవలను కొనియాడారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

వృద్ధురాలి మెడలో గొలుసు కాజేసిన వ్యక్తి అరెస్టు


నిందితుడు నాగార్జున

పెదకాకాని: ఇల్లు అద్దెకు కావాలని వచ్చి వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు లాక్కెళ్లిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం .. పెదకాకాని మండలంలోని కొప్పురావూరులో నివాసం ఉంటున్న వృద్ధురాలు బొర్రా సుజాత వద్దకు ఈనెల 7న గుర్తు తెలియని వ్యక్తి వచ్చి పోస్టుమెన్‌గా పని చేస్తున్నానంటూ పరిచయం చేసుకున్నాడు. ఇల్లు అద్దెకు కావాలంటూ మాట్లాడి వృద్ధురాలిని నమ్మించాడు. తాగడానికి నీళ్ల అడిగి ఆమె వెంట ఇంటిలోకి వెళ్లి మెడలో బంగారు గొలుసు లాక్కొని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసులు గుంటూరు రూరల్ మండలం, జొన్నలగడ్డ గ్రామానికి చెందిన ఇమడాబత్తిన నాగార్జునను అదుపులోకి తీసుకున్నారు. నిందితుణ్ణి అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు గురువారం పెదకాకాని సీఐ టి. నారాయణస్వామి తెలిపారు. నిందితుడు అరండల్‌పేట బ్రాంచిలో పోస్టుమేన్‌గా పని చేయడం విశేషం.

విద్యుత్ చార్జీలను తగ్గించాలి

చేబ్రోలు: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన రూ.6074 కోట్ల విద్యుత్ చార్జీలు తగ్గించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఎం నేతలు చేబ్రోలు తహసీల్దారు కార్యాలయం ఎదుట గురువారం ధర్నా చేశారు. అనంతరం వినతిపత్రాన్ని డెప్యూటీ తహసీల్దారు శ్రీనివాసరావుకు అందజేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దండా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉచిత ఇసుక బ్లాక్ మార్కెట్టుకు తరలకుండా చర్యలు తీసుకోవాలని, భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించి కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. నిత్యవసర వస్తువుల ధరలను అదుపు చేయాలని తెలిపారు. బెల్టు షాపుల ద్వారా మద్యం అమ్మే విధానాన్ని అరికట్టాలని, షాపులు ఇళ్ల మధ్య లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పి. ఆదిశేషు, చౌడయ్య, జి. శ్రీనివాసరావు, మస్తాన్‌వలి పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం



పొన్నూరు: స్థానిక శాఖ గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. తొలుత మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, ఆటల పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి జి. కృష్ణమోహన్ మాట్లాడుతూ ఈ నెల 20 వరకు నిర్వహించే ఆటల పోటీల్లో విద్యార్థులు పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పి. నరేష్ కుమార్ పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ

పెదకాకాని: జేఎంజే సంస్థ పేద ప్రజలకు ఎప్పుడూ అండగానే నిలుస్తుందని సంస్థ డైరెక్టర్ రెవరెండ్ సిస్టర్ మేరీకుమారి అన్నారు. పెదకాకాని మండలంలోని నంబూరు యానాదికాలనీ, తక్కెళ్ళపాడు మహాలక్ష్మీ బాజీబాబా కాలనీలకు చెందిన 180 కుటుంబాలకు గురువారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ముందుగా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో నల్లపాడు జేఎంజే సంస్థ ప్రతినిధులు, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో వంటకాల తయారీపై శిక్షణ

గుంటూరు రూరల్: రైతునేస్తం ఫౌండేషన్ సహకారంతో కర్షక్ సేవా కేంద్రం నిర్వహణలో ఈనెల 30న, డిసెంబర్ 1,2 తేదీల్లో చిరుధాన్యాలతో వంటకాల తయారీపై శిక్షణ ఇవ్వనున్నట్లు రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై. వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట దగ్గరలో కొర్నెపాడులో ఉన్న ఫౌండేషన్ ఆవరణలో వంటకాల నిపుణులు మిల్లెట్స్ రాంబాబు, ఇతర నిపుణులు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పాల్గొనేవారికి ఫౌండేషన్ ఆవరణలో టిఫిన్, భోజనం సదుపాయం ఉంటుందని తెలిపారు. వివరాలకు 97053 83666, 95538 25532 నంబర్లలో తప్పనిసరిగా ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయండి

డీపీవో బి.వి. నాగసాయికుమార్



గుంటూరు రూరల్: గ్రామాల అభివృద్ధికి పంచాయతీ అధికారులు కృషిచేయాలని డీపీవో బి.వి. నాగసాయి కుమార్ తెలిపారు. నగరంలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ అధికారులకు గురువారం జరిగిన శిక్షణ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనులు, ప్రజా సమస్యల పరిష్కారం తదితర విషయాలను వివరించారు. ఎంపీడీవో బండి శ్రీనివాసరావు, ఈవో పీఆర్‌డీ శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

108 వాహన ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

చేబ్రోలు: తమ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరుతూ 108 సిబ్బంది మండలాధికారులకు వినతిపత్రాలను అందజేశారు. చేబ్రోలు ఎంపీడీవో కె. లలిత, తహసీల్దారు శ్రీనివాసశర్మలకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని, సమ్మె నోటీసులను వారు అందజేశారు. ఈ సందర్భంగా 108 అంబులెన్స్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నాయకులు వై. శివశంకర్, భవనాశి యహోషువా, జి. ఇందిర మాట్లాడుతూ 108 వ్యవస్థను ప్రభుత్వమే నిర్వహించి, ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 25వ తేదీ నుండి నిరవధిక సమ్మెకు సిద్ధపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినప్పుడల్లా 108 నిర్వహణ సంస్థలు మారుతున్నాయని, మారిన ప్రతిసారీ తాము నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్జిత సెలవులు, గ్రాడ్యుటీ, పెండింగ్ బిల్లులు, వేతనాలు చెల్లించకుండా ఉద్యోగులకు నష్టం చేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో రద్దు చేసిన జీవో 49ను పునరుద్ధరించాలని కోరారు. అంబులెన్స్ సేవల్లో పనిచేస్తూ మరణించిన ఉద్యోగి కుటుంబానికి రూ.20లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు.


ఎంపీడీవోకు సమ్మె నోటీసును అందజేస్తున్న ఉద్యోగులు

ఉత్తమ అధ్యాపకురాలికి అభినందనలు

గుంటూరు రూరల్: నల్లపాడులోని ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో సీనియర్ కంప్యూటర్ ఇంజనీరింగ్ అధ్యాపకురాలైన పదముత్తం నీలిమను ఉత్తమ అధ్యాపక అవార్డుకి రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ సందర్భంగా గురువారం కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు అమెను అభినందించారు. జాతీయ విద్యా దినోత్సవం- 2024ను పురస్కరించుకొని ఈ అవార్డుని ప్రదానం చేస్తారు. పదముత్తం నీలిమ 2017 నుంచి ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో పనిచేస్తూ కళాశాలకు ఎన్‌బీఏ గుర్తింపు రావడానికి కృషి చేశారు. సెక్షన్ కో-ఆర్డినేటర్‌గా, ఎస్‌బీటెట్ సిస్టమ్ అనలిస్ట్‌గా పని చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ టి. శేఖర్ మాట్లాడుతు నీలిమ ఎంతో మంది విద్యార్థులకు నైపుణ్యాలను నేర్పుతూ, ప్రాంగణ ఎంపికలకు కృషి చేశారని తెలిపారు. ఈ సందర్భంగా అధ్యాపకులు పి. రవీందర్ తదితరులు నీలిమకు అభినందనలు తెలిపారు.


అవార్డు పొందిన నీలిమను అభినందిస్తున్న కళాశాల అధ్యాపకులు

భవిష్యత్తు అంతా విద్యుత్ వాహనాలదే...

గుంటూరు రూరల్: భవిష్యత్తు మొత్తం విద్యుత్ వాహనాలదేనని చలపతి ఇంజినీరింగ్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వై. సుజిత్‌కుమార్ తెలిపారు. నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో గురువారం ఎలక్ట్రికల్ వాహనాలపై విద్యార్థులకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా మైటిజన్ సర్వీసెస్ ఎడ్వయిజర్ డాక్టర్ కె. ధనుంజయ్ మాట్లాడుతూ విద్యుత్‌తో నడిచే వాహనాల వల్ల పర్యావరణ కాలుష్యం ఉండదని, పెట్రోల్, డీజిల్ వినియోగం తగ్గించుకోవచ్చని తెలిపారు. భవిష్యత్‌లో లిథియం బ్యాటరీతో నడిచే వాహనాలు విరివిగా అందుబాటులోకి వస్తాయని చెప్పారు. 2020 వరకూ 19 వేలు మాత్రమే విద్యుత్ వాహనాలు వినియోగించేవారని, కానీ 2023లో దేశవ్యాప్తంగా 4.50 లక్షలు అమ్ముడయ్యాయని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యుత్ వాహనాల టెక్నాలజీని ప్రతి విద్యార్థీ తెలుసుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం 2877 చార్జింగ్ స్టేషన్స్‌ను అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ పి.నరేంద్రకుమార్, డాక్టర్ జె. లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.


విద్యుత్ వాహనాలను గురించి విద్యార్థులకు వివరిస్తున్న డాక్టర్ ధనుంజయ్

మాజీ ప్రధానుల విగ్రహాల ఆవిష్కరణ

పెదకాకాని: పెదకాకాని సెంటర్‌లో ఏర్పాటు చేసిన దేశ మాజీ ప్రధానులు జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీల విగ్రహాలను గురువారం రాష్ట్ర పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో బీజేపీ ఆర్‌ఎస్‌ఎస్ మతతత్వ పార్టీలను తరిమికొట్టాలన్నారు.కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రేమ కోసం, ఐకమత్యం కోసం రాహుల్‌గాంధీ పాదయాత్ర నిర్వహించారన్నారు.బీజేపీ ప్రభుత్వం దేశానికే కాకుండా రాష్ట్రానికి కూడా తీరని ద్రోహం చేసిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇంతవరకు ఇవ్వలేదని, విభజన హామీలు కూడా ఏ ఒక్కటీ అమలు చేయలేదని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, లక్ష్మణరెడ్డి, లింగంశెట్టి ఈశ్వరరావు, షేక్ మస్తాన్‌వలి, కూచిపూడి విజయ, చిలక విజయ్‌కుమార్, వణుకూరి శ్రీనివాసరెడ్డి, జొన్నల వెంకటరెడ్డి పాల్గొన్నారు.


పెదకాకాని సెంటర్‌లో మాట్లాడుతున్న షర్మిల

అవార్డు గ్రహీతలకు వర్సిటీ వీసీ అభినందన

ఏఎన్‌యూ: థాయిలాండ్, బ్యాంకాక్‌లో యురేషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఈయూ) షినవత్రా విశ్వవిద్యాలయం, పాతుమ్‌థాని, థాయిలాండ్ రిసెర్చ్ కల్చర్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా ఈనెల 8, 9 తేదీలలో జరిగిన 'పరిశోధన, ఆవిష్కరణలపై' అంతర్జాతీయ సమావేశంలో వర్సిటీ అధ్యాపకులు ఆచార్య మధుబాబు, ఆచార్య నాగరాజు పరిశోధన పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య కంచర్ల గంగాధర్‌రావు అవార్డు గ్రహీతలను గురువారం సత్కరించారు. ఎకనామిక్స్ విభాగధిపతి, పీజీ బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ ఆచార్య కడిమి మధుబాబు, కామర్స్ అండ్ ఎకానమీ సెషన్‌లో ''స్వచ్ఛ భారత్ మిషన్ అండ్ ఇట్స్ రోల్ ఇన్ ట్రాన్స్‌ఫర్మింగ్ రూరల్ శానిటేషన్ ఇన్ ఇండియా'' అంశంపై సమర్పించిన పత్రం ఉత్తమ పరిశోధన పత్రంగా ఎంపికైందని తెలిపారు.

వర్సిటీ హాస్పటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగధిపతి ఆచార్య బి.నాగరాజు 'ఎక్స్‌ప్లోరింగ్ క్వాలిటీ ఆఫ్ వర్క్ లైఫ్ ఫర్ వుమెన్ ఎంప్లాయిస్: ఏ కేస్ స్టడీ ఇన్ సౌత్ సెంట్రల్ రైల్వే' అంశంపై సమర్పించిన పత్రం బెస్ట్ రీసెర్చ్ పేపర్‌గా ఎంపికైందని చెప్పారు. ఆచార్య మధుబాబు, ఆచార్య నాగరాజులను వర్సిటీ ఆర్ట్స్, కామర్స్ అండ్ లా కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సురేష్ కుమార్, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

నెహ్రూ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

కాకుమాను: పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జీవితాన్ని నేటి విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని గ్రంథాలయ అధికారి జోగి మోహనరావు అన్నారు.స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ గులాబీలు, చిన్నారులంటే నెహ్రూకు చాలా ఇష్టమని తెలిపారు. అందుకోసమే ప్రతి ఏటా ఆయన జయంతిని బాలల దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. నేటి బాలలే రేపటి పౌరులని తెలిపారు. ప్రతి విద్యార్థి చిన్న వయస్సు నుంచే ఒక లక్ష్యాన్ని ఎంచుకొని దానిని సాధించే దిశగా ముందుకు సాగాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నెహ్రూ జయంతి వేడుకల్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.కార్యక్రమంలో హెచ్‌ఎం బి.సత్యం,ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

ఏటుకూరు గ్రంథాలయంలో వారోత్సవాలు

గుంటూరు రూరల్: మండలంలోని ఏటుకూరు గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గురువారం బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారిణి పి. పరమేశ్వరి స్థానిక జిల్లా పరిషత్ స్కూల్ విద్యార్థులకు పుస్తక పఠనం వల్ల కలిగే లాభాలు వివరించారు. చిన్నారులకు బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా చాచా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జాతీయ నాయకులు జీవిత గాథల పుస్తకాలను చిన్నారులతో చదివించి వివరించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ డి. లక్ష్మీదుర్గ, పాఠశాల పీడీ రాజ్యలక్ష్మి, చిన్నారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేడుకలు

చేబ్రోలు: మండలంలోని నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి హెచ్‌ఎం ఎం. ఏడుకొండలు అధ్యక్షత వహించారు. విద్యార్థులు పలు ప్రదర్శనలు, వేషధారణలతో ఆకట్టుకున్నారు. జిల్లా స్థాయిలో వ్యాసరచన, డిబేట్ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు, పాఠశాల స్థాయిలో వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, మెమెంటోలు అందజేశారు. రాష్ట్ర , జాతీయ స్థాయి హ్యాండ్ బాల్‌పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు ప్రదర్శించిన నాటికలు, నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ నాగమల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు కోటి పద్మ, సరోజిని, మంగళ గౌరి, వ్యాయామ ఉపాధ్యాయులు బి. వెంకటేశ్వరరావు, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు

పెదకాకాని: గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని మండల విద్యాశాఖాధికారి జి. సత్యనారాయణమూర్తి అన్నారు. పెదకాకాని లూథర్‌గిరి కాలనీలో గురువారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి స్థానిక గ్రంథాలయాధికారి వేముల విజయ్‌కుమార్ అధ్యక్షత వహించారు. ముందుగా జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయాల ప్రాముఖ్యతను తెలియజేశారు. విద్యార్థులకు దేశభక్తి గేయాల పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ శంకరరాజు, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొల్లిపర ఆనందరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


హైస్కూలులో నెహ్రూ చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న హెచ్‌ఎం సత్యం, విద్యార్థులు


కాకుమాను గ్రంథాలయంలో వేడుకలు


నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంఈఓలు శంకరరాజు, సత్యనారాయణమూర్తి


నారాకోడూరు హైస్కూల్‌లో విద్యార్థుల వేషధారణలు

విద్యార్థులే దేశానికి తరగని సంపద

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులే దేశానికి తరగని సంపద అని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. ఎన్జీవో కాలనీలోని సుమేధ హైస్కూల్ ఆధ్వర్యంలో ఎంఎస్‌ఆర్ కన్వెన్షన్‌లో గురువారం బాలోత్సవ్-7ను నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న లక్ష్మణరావు మాట్లాడుతూ పిల్లలంటే ఎంతో ప్రేమగా మెలగిన చాచా నెహ్రూ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థుల దేశం గర్వించే పౌరులుగా ఎదగాలని సూచించారు. పాఠశాల డైరెక్టర్ ఎం. చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ సుమేధ బాలోత్సవ్-7 పేరుతో నెల రోజుల నుంచి విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. బాలల దినోత్సవ రోజున ముగింపు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో విజేతలకు మూడువేల బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పర్యావరణ ఇంజినీర్ నాజియా బేగం, అయ్యప్ప, హరిత హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ శిరీష, ఆచార్య వీర రాఘవరావు, తిరుపతిరెడ్డి, ప్రిన్సిపాల్ రాంబాబు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వ్యాస రచన పోటీలకు స్పందన

కొరిటెపాడు(గుంటూరు): జేకేసీ కళాశాల గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా గురువారం రాష్ట్రస్థాయిలో సెల్‌ఫోన్ వల్ల సమాజానికి లాభమా? నష్టమా? అనే సంశంపై వ్యాస రచన పోటీలను నిర్వహించారు. 20 కళాశాలల నుంచి 90 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రథమ బహుమతిని నాగార్జునసాగర్ విజయపురి సౌత్‌లోని ఏపీఆర్ డీసీ కళాశాలకు చెందిన జి.వంశీ, ద్వితీయ బహుమతిని విజయవాడలోని సిద్ధార్థ కళాశాలకు చెందిన బి.దుర్గాభవాని, తృతీయ బహుమతిని వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీకి చెందిన బి.కావ్యనాగిని గెలుచుకున్నారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ జాగర్లమూడి మురళీమోహన్, ప్రిన్సిపాల్ పరుచూరి గోపీచంద్, పీజీ కోర్సుల డైరెక్టర్ శరణు రామకృష్ణప్రసాద్ గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ బహుమతి రూ.5 వేలు, ద్వితీయ బహుమతి రూ.3 వేలు, తృతీయ బహుమతి రూ.2 వేలు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థికీ ధ్రువపత్రం అందజేశారు. కళాశాల గ్రంథాలయ విభాగాధిపతి సీహెచ్. నాగభవాని, సిబ్బంది పాల్గొన్నారు.

బస్సు ఎక్కుతూ జారిపడి యువకుడి దుర్మరణం

లక్ష్మీపురం: ఆర్టీసీ బస్సు వెనుక టైరు కింద పడి యువకుడు అక్కడిక్కడే మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. రేపల్లె ఖాజీపాలెం గ్రామానికి చెందిన చేబ్రోలు అఖిల్ (22) గుంటూరు ప్రభుత్వ సమగ్రాసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా అప్రెంటిస్ చేస్తుంటాడు. రేపల్లె వెళ్ళేందుకు గుంటూరు బస్టాండ్‌లోని ప్లాట్‌ఫామ్ నంబర్ 28 వద్ద బస్సు ఎక్కేందుకు వస్తున్న క్రమంలో కాలు జారీ వెనుక టైరు కింద పడ్డాడు. టైరు ఎక్కడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. ఈస్ట్ ట్రాఫిక్ పోలీసులు ఘటన జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి మృత దేహాన్ని ప్రభుత్వ సమగ్రాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

మధుమేహంపై అవగాహన అవసరం



గుంటూరు రూరల్: మధుమేహంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ సంధ్య తెలిపారు. గోరంట్ల గ్రామంలోని కళాశాలలో గురువారం ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు, అధ్యాపకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థినులు మధుమేహ వ్యాధి లక్షణాలు, నియంత్రణ చర్యలుపై లఘు నాటికను ప్రదర్శించి అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ మధుమేహ వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రిన్సిపాల్ వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఆర్. షారోన్‌రోజ్, బి. రంజిత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.